క్లుప్తంగా

ఇసుక వాగు పూడికతీత పనులు



కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో ఇసుక వాగు పూడిక తీత పనులను గ్రామ సర్పంచ్ ఇరికెదిండ్ల రమణకొండలు బుధవారం ప్రారంభించారు. ఇసుక వాగు వ్యర్థాలతో నిండి పూడిపోయి సమస్యాత్మకంగా మారడంతో దాని పూడిక పనులు చేపట్టారు. ఒప్పిచర్ల, ఎర్రపాలెం గ్రామాల మధ్య సుమారు కిలో మీటరు పొడవున్న వాగులో పూడిక తీసి దానిని ట్రాక్టర్లతో బయటకు తరలిస్తున్నారు. చాలా కాలంగా పూడిక తీయకపోవడంతో వాగు నుంచి దుర్వాసనతో పాటు దోమలు కూడా ఎక్కువగా ప్రబలుతుండడంతో గ్రామ పంచాయతీ ఈ చర్యలు చేపట్టింది. పనులను వైఎస్సార్ సీపీ నాయకుడు ఇరికెదిండ్ల లాజర్ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

మణిపూర్ ఘటనపై ర్యాలీ



గురజాల : మణిపూర్‌లో స్త్రీలను నగ్నంగా ఊరేగించడం సామూహిక అత్యాచారాలు చేయడం వంటి ఘటనలతో దేశం సిగ్గుతో తలదించుకోవాల్సి వస్తోందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జానీబాషా అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అందుకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీనుద్దేశించి ఆయన మాట్లాడుతూ గిరిజన మహిళలపై దాడులు చేసిన వారిని తక్షణమే అదుపులోకి తీసుకుని వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇటువంటి ఘటనలు మరలా దేశంలో ఎక్కడా పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కరణం కాశీవిశ్వనాథ్, చల్లా రామిరెడ్డి, నాగార్జున, ప్రభుదాస్, కర్రా చిన కోటేశ్వరరావు, చీతిరాల కోటేశ్వరరావు, కత్తి చలమరాజు, తదితరులున్నారు.

నూతన బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని వినతి



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల నుంచి హైదరాబాద్, తిరుపతి, శ్రీశైలం వంటి నగరాలకు నూతన బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని నర్సరావుపేట టీపీటీఓ శ్రీనివాసరావుకు పిడుగురాళ్ల పట్టణ అభివృద్ధి కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిడుగురాళ్ల పట్టణంలో బస్సు ప్లాట్ ఫారం పెంపు, ప్రహరిగోడ నిర్మాణం వంటివి చేయాలని ఆయన తెలియజేశారు. అదేవిధంగా పిడుగురాళ్ల నుంచి అమరావతి, ఒంగోలు వంటి నగరాలకు కూడా నూతన సర్వీసులను ఏర్పాటు చేయాలని వారు ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల పట్టణ అభివృద్ధి సంఘం గౌరవ అధ్యక్షుడు చింతా వెంకట రామారావు, అధ్యక్షుడు జూలకంటి శ్రీనివాసరావు, కృష్ణ, తదితరులు ఉన్నారు.

పీఎం కిసాన్ ఈ కేవైసీ ఈ నెలాఖరు వరకు

ఏఓ అమీర్‌రెడ్డి

దుర్గి: రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సకాలంలో ఈకెవైసి పూర్తి చేసి లబ్ధి పొందాలని ఏఓ వై అమీర్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి కిసాన్ సమన్ నిధి కింద అందజేస్తున్న రూ. 6వేలు పొందడానికి మిగిలిపోయిన రైతులు ఈ నెల 31వ తేదీ లోపు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో ఈకేవైసి పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించారు. అడిగొప్పల నుంచి 155 మంది, ఆత్మకూరు 88, ధర్మవరం 36, దుర్గి 175, కోలగుట్ల 39, ముటుకూరు 46, ఓబులేశునిపల్లె 83, పోలపల్లి 57, నిదానంపాడు 18, మొత్తం మండల వ్యాప్తంగా 711 మంది రైతులు ఈకెవైసి పూర్తి చేయవలసి ఉన్నదన్నారు. అలాగే సీసీఆర్సి కార్డులు పొందవలసిన కౌలు రైతులు కూడా స్థానిక ఆర్‌బికెకేంద్రంలోని వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి వివరాలు అందజేయాలని కోరారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

మాచర్ల: ఆర్యవైశ్యులలోని పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలందించాలని వాసవి క్లబ్ వనిత చెన్నకేశవ మాచర్ల అధ్యక్షురాలు మేడా వెంకట లక్ష్మి అన్నారు. బుధవారం ఆర్యవైశ్య వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు దాతల ద్వారా బాధితురాలుకు 50 కేజీల బియ్యం టిక్కీ అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టణంలో పేద ఆర్య వైశ్యులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలందించాలన్నారు. కార్యక్రమంలో మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులు ఓరుగంటి చెన్నకేశవరావు, వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, వృద్ధాశ్రమ అధ్యక్షులు పోలిశెట్టి చిన పిచ్చయ్య, పరిటాల ధనలక్ష్మి, రమాదేవి, ఇందిరా తదితరులున్నారు.

ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు

జగనన్న నవరత్నపథకాలు నూటికి నూరు శాతం లబ్ధిదారులకు అందించాలని, ప్రభుత్వ సేవలను సకాలంలో చేకూర్చి ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలను అర్హులందరి బ్రతుకుల్లో నవరత్నాల వెలుగులు నింపాలి. ఇదే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అర్హులకు అవసరమైన వారందరికీ ఏ మాత్రం జాప్యం లేకుండా శిబిరంలోనే ధ్రువీకరణ పత్రాలు అందించే చర్యలు చేపట్టారు. వలంటీర్లు క్షేత్రస్థాయిలో యుద్ధప్రాతిపదికన సర్టిఫికెట్లు అందించారు.



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

- జగనన్న సురక్షకు అద్భుత స్పందన
- 17025 లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేత
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

మాచర్ల రూరల్: ఒక రేషన్‌కార్డు, కుల, ఆదాయ, ఆరోగ్య శ్రీ, జాబ్ కార్డు, టైటిల్ డీడ్ సర్టిఫికెట్లు పొందాలంటే గతంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ వారాల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాలి. కాళ్ళలరిగేలా తిరిగినా అధికారులు అందుబాటులో లేక పనులు లేక కార్యాలయాలలోనే పడిగాపులు కాసేవారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన వచ్చిన తరువాత సచివాలయ వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజల ఇంటి ముందుకే 542 సేవలను సచివాలయంలోకి తీసుకొచ్చారు. వీటి ద్వారా అక్కడికక్కడే ఆ గ్రామంలోనే వారి సమస్యలను తీరుస్తున్నారు. అయినప్పటికీ ప్రజలకు అవసరమైన ఇంకా కొందరు సరైన సర్టిఫికెట్‌లేక ఇంకా పథకాలు అందని వారి కోసం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించి లబ్ధిదారుల అర్జీలు తీసుకున్న వెంటనే 11 రకాల సర్టిఫికెట్లను ఇంటి వద్దకే వెళ్లి చర్యలు చేపట్టారు. మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించారు. నియోజక వర్గంలోని ఐదు మండలాలో 17025 లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్లును శిబిరంలోనే అందజేశారు. వీటిలో కుల, జననం, మరణం, ఆదాయం, మ్యారేజి, ఫ్యామిలీ మెంబర్, ముటేషన్, ఆధార్ కార్డు, సిసిఆర్ కార్డులను అందించారు. అర్జీల్లో 98 శాతం ఇప్పటి వరకు పరిష్కరించారు. మిగిలిన వాటికి విచారించి సర్టిఫికెట్లు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాలకు వెళ్ళకుండా, ఎవరి సిఫారసులు లేకుండా ఏ ఒక్క పైరవీదారులు లేకుండా, పైసా ఖర్చు లేకుండా అవసరమైన పత్రాలు అందించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫోన్ చేద్దాం..సమస్య చెబుదాం

పిడుగురాళ్ల: ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా వాటిని పరిష్కరించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. దానికి అనుగుణంగానే వారి సమస్యలను వినేందుకు, వారి సమస్యలను పరిష్కరించేందుకు వివిధ రకాల టోల్ ఫ్రీ నంబర్లను కేటాయించింది.

ఆ నంబర్లకు ఫోన్ చేస్తే వారి సమస్యలను ఆలకించి సంబంధిత అధికారులకు సమాచారం అందించి వారి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ టోల్ ఫ్రీ నంబర్లకు ఎవరైనా సమస్య ఉందని ఫోన్ చేసిన వెంటనే వాటిని పరిష్కరించే విధంగా ఆయాశాఖల అధికారులు ప్రయత్నం చేస్తారు. దీంతో ప్రజా సమస్యలు ఈ టోల్ ఫ్రీ నంబర్ల ద్వారా పరిష్కరం అవుతున్నాయి.

అన్ని సాధారణ సమస్యలకు	- 1902
అవినీతి	- 14400
ఇసుక, మద్యం దుకాణాలు	- 14500
రైతు భరోసా	-1907
ఆరోగ్య శ్రీ ట్రస్ట్	-104
మహిళలు, బాలలపై హింస	-1091
ట్రాఫిక్ సమస్యలు	- 1073
నీటి సరఫరా	- 155313
క్రైమ్ స్టాపర్	- 1090
ఉచిత అంబులెన్స్	- 102
ఎమర్జెన్సీ అంబులెన్స్	- 108
ఓటరు ఎన్‌రోల్‌మెంట్	-1950
ఇంటిగ్రేటెడ్ పోలీసింగ్	- 112

ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు

మాచర్ల: వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో ప్రతి ఒక్కరూ విద్య పట్ల శ్రద్ధ చూపిస్తూ ఉత్తమ ప్రతిభను చాటడం సంతోషకరమని ఎంఈఓ వేముల నాగయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని నారాయణ స్కూల్‌లో జరిగిన ఒలింపియాడ్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివేలా ఉపాధ్యాయులు విద్యనందించాలన్నారు. పేరెంట్స్ డే సందర్భంగా ఆటల పోటీలో గెలుపొందిన తల్లిదండ్రులకు బహుమతులు అందజేసినట్లు ప్రిన్సిపల్ ఉల్లారెడ్డి అన్నారు. ఎజీఎం లక్ష్మణ్‌రెడ్డి, ఇన్‌చార్జిలు గౌసియా, చందన, ఆంజనేయులు, ఉదయలక్ష్మి, రీహానీ, శివ, కిరణ్ పాల్గొన్నారు.

పేదలకు మేలు చేయడమే జగనన్న సురక్ష లక్ష్యం

ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

రెంటచింతల: రాష్ట్రంలోని పేద ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. బుధవారం రెంటచింతల గ్రామంలోని సచివాలయం-111 వద్ద సర్పంచ్ పూజల పుష్పావతిరామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి గడప గడపకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడమే కాకుండా ఆ ఇంట్లో అర్హత ఉండి సంక్షేమ పథకం అందనివారి వివరాలు సేకరించి వారికి ఆ సంక్షేమ పథకాన్ని అందిస్తున్న తొలి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత దేశ చరిత్రలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఏ రాష్ట్రంలో ఇప్పటి వరకు అమలు చేయని విధంగా ప్రజలకు క్షేత్రస్థాయిలోనే వారికి అవసరమైన కులం, ఆదాయం, నివాసం, అడంగళ్, పింఛన్, రేషన్ కార్డు, వితంతు, కుటుంబ విభజన తదితర 11 రకాల ధృవీకరణ పత్రాలను ఉచితంగా అందచేయడానికి జగనన్న సురక్ష కార్యక్రమం సీఎం జగన్ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ విప్లవాత్మక కార్యక్రమం ద్వారా ఇప్పటికే రాష్ట్రంలోని అనేక లక్షల కుటుంబాలకు ఎంతో మేలు జరిగిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి రాష్ట్రంలోని ప్రతి పల్లెలో విశేష స్పందన లభిస్తుందన్నారు. అనంతరం వివిధ రకాల సేవలకోసం, పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న 121 మందికి ధృవీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమలో సర్పంచ్ పూజల పుష్పావతిరామయ్య, తహసీల్దార్ కట్టే కోట పుల్లారావు, వైఎస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన నాయకులు మోర్త ఉమ, మండల సచివాలయాల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, ఈఓపీఆర్డీ సీహెచ్ రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, కార్యదర్శి జి. అనంత కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



సర్టిఫికెట్‌ను పంపిణీ చేస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, అధికారులు



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్, స్థానిక ప్రజా ప్రతినిధులు

కారెంపూడి: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో మొత్తం 4,668 అర్జీలను పరిష్కరించి తగిన ధ్రువీకరణ పత్రాలు అందించడం జరిగిందని తహసీల్దార్ జి శ్రీనివాస్ పేర్కొన్నారు. కారెంపూడి-2 సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. బుధవారంతో మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ప్రజల సమక్షంలో వారి గ్రామాల్లోనే సమస్యలను పరిష్కారం చేసి ధ్రువీకరణ పత్రాలను అందించామన్నారు. కారెంపూడి-2 గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 90 వివిధ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి అర్జీలు వచ్చాయని వాటన్నింటిని పరిష్కరించి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితేజానాయక్, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, ఎంపీటీసీలు బొమ్మిన సావిత్రిఅల్లయ్య, అంతరగడ్డ ఏసోబు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అల్లు వెంకటేశ్వర రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాతూరి రామి రెడ్డి, ఆశం విజయభాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల: రాష్ట్రంలో గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి వారి అభివృద్ధే లక్ష్యంగా పథకాలు రూపొందించటమే కాకుండా మ్యానిఫెస్టోలో ఇచ్చిన విధంగా నవరత్నాల పథకాలను 98 శాతం అమలు చేసిన నాయకుడని మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం వైఎస్సార్ సీపీ సోషల్ మీడియాలో భాగమైన టీం జగనన్న యాప్‌లో మాచర్ల నియోజక వర్గ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన టాప్ ఫర్ఫార్మెర్స్‌ను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జరపల సుధాకర్ నాయక్, జరపల గాంధీనాయక్, ఎం శ్రీకాంత్‌రెడ్డి, మేడం రాంప్రసాద్‌రెడ్డి, సిరికొండ నాగరాజు తదితరులున్నారు.

ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యంతో బోధించాలి

ఈపూరు: ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న బోధనా నైపుణ్యాలతో విద్యార్థులకు చక్కగా బోధిస్తే చదువులో ఉన్నత స్థానాలు పొందుతారని ఈపూరు జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు జెడ్పీ హైస్కూల్లో స్కూల్ కాంప్లెక్ సమావేశం బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మొదటగా పాఠశాల సముదాయం సంయుక్త కార్యదర్శిగా ఊడిజర్ల హెచ్‌సీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులును ఎన్నుకున్నారు. సమావేశంలో శిక్షకులు వారికి నూతన మెలకువలు నేర్పించారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు బోధనా నైపుణ్యాలు పెంచుకుని తద్వారా విద్యార్థులకు ఎలా చెబితే అర్థమవుతుందో తెలుసుకొని చక్కగా చెబితే వారి లక్ష్యాలు పూర్తిగా నెరవేర్చిన వారవుతారన్నారు. వారి జ్ఞాపకశక్తి పెంపొందించేలా, వారి పరీక్ష సమయాల్లో మనం ఏ విధంగా నేర్పిస్తే మంచిగా రాస్తారో అర్థం చేసుకోవాలన్నారు. పలు బోధనా అంశాలపై విశదీకరించారు.



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి

నాణ్యమైన భోజనం అందించండి

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరు జెడ్పీహెచ్ ఎస్‌లో బుధవారం జరిగిన పాఠశాలల సముదాయ సమావేశంలో మండల ఎంఈవో -2 రామతులసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన విద్యావిధానంలో సాంకేతిక అంశాలు బోధన సమయంలో జోడించాలని, అప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించవచ్చని తెలిపారు. అనంతరం ఆమె పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



పేకాట స్థావరంపై దాడి

బొల్లాపల్లి: మండలంలోని సీతారామపురం తండాలో పేకాట స్థావరంపై బుధవారం బండ్లమోటు స్టేషన్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, రూ.29190లు స్వాధీనం చేసుకున్నారు. సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి నిర్వహించామని, ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, రూ.29190ల నగదు స్వాధీన పరచుకుని, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచినట్లు ఈ మేరకు బండ్లమోటు స్టేషన్ ఎస్సై జి. రవికృష్ణ తెలిపారు.

రీసర్వే పనుల పురోగతి వేగవంతం చేయాలి

శావల్యాపురం: రీసర్వే పనులు రైతుల సమక్షంలో పారదర్శంగా తర్వతిగతిన పూర్తిచేయాలని నరసరావుపేట డివిజన్ రెవెన్యూ అధికారి మర్రిడ్డి శేషిరెడ్డి అన్నారు.బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రీసర్వే పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆర్డీవో శేషిరెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 140 రెవెన్యూ గ్రామాలు ఉండగా 70 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తి కాగా 45 గ్రామాల్లో భూహక్కు పత్రాలు అందజేశామన్నారు. 45 గ్రామాల్లో రికార్డు పనులు జరుగుతున్నాయని,15 గ్రామాల్లో భూములపై గ్రౌండ్ టూతింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. సెప్టెంబరు నాటికి పూర్తిస్థాయిలో రీసర్వే పనులు పూర్తి అయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. శావల్యాపురం మండలంలో పిచికలపాలెం ,వేల్పూరు,శానంపూడి రెవెన్యూ గ్రామాల్లో రికార్డు పనులు జరుగుతున్నాయన్నారు. ఈక్రమంలో రీసర్వే పనులు పురోగతి పెరిగేలా రెవెన్యూ అధికారులకు దిశ నిర్దేశం చేశామన్నారు. ఆయనతో పాటు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, డిప్యూటీ తహసీల్దార్లు వేముల వెంకట నాగరాజు, పి.నాసరయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

కార్గిల్ వీరులను స్మరించుకోవడం మనందరి బాధ్యత

రెంటచింతల: దేశ సరిహద్దుల్లో పాకిస్తాన్ ముష్కర్లతో 85 రోజులపాటు జరిగిన కార్గిల్ వార్‌లో అసువులు బాసిన కార్గిల్ వీరులను స్మరించుకోవడం మనందరిబాధ్యతని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, ఎస్ఐ సయ్యద్ షమీర్ భాషా అన్నారు. బుధవారం కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో, పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. భారత సైన్యం 1999 మే 3 నుంచి 1999 జూలై 26 వరకు కార్గిల్ యుద్ధంలో 537 మంది భారత సైన్యం అమరులయ్యారని గుర్తు చేశారు. ఈ యుద్ధంలో భారత సైన్యం పూర్తి విజయం సాధించి దేశ ప్రతిష్టను ప్రపంచానికి చాటినట్లు పేర్కొన్నారు. ఈ విజయానికి గుర్తుగా ప్రతి ఏటా జూలై 26న కార్గిల్ విజయ్ దివాస్ దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. అనంతరం పాఠశాలలో అమర వీరుల చిత్రానికి నివాళి అర్పించగా, పోలీస్ స్టేషన్‌లో కన్నెగంటి హనుమంతు పౌండేషన్ అధ్యక్షుడు నారాయణపురం శ్రీనివాసరావు, ఏఎస్ఐ హనుమంతరావు, పోలీసు సిబ్బందితో కలిసి ఎస్ఐ సయ్యద్ షమీర్ భాషా కార్గిల్ వార్ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీయూపీ హెచ్ఎం కె.నాగేశ్వరరావు, ఫౌండేషన్ సోషల్ విభాగం కో.ఆర్డినేటర్ విజయసారధి, ఉపాధ్యాయులు డాక్టర్ ఎంబి చిన్నమ్మ, భీముడునాయక్, అర్చకులు ఓరుగంటి మారుతీశర్మ తదితరులు పాల్గొన్నారు.



కార్గిల్ వార్ పోస్టర్లను ఆవిష్కరించిన ఎస్ఐ సయ్యద్ షమీర్ భాషా, నారాయణపురం శ్రీనివాసరావు

వెల్లివిరిసిన మత సామరస్యం

దుర్గి: కులమతాలకు అతీతంగా, మండల పరిధిలోని వివిధ గ్రామాలల పీర్ల పండుగను వైభవంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని కంచరగుంట గ్రామంలో పూర్తిగా హిందువుల ఆధ్వర్యంలో కొన్ని సంవత్సరాలుగ సాంప్రదాయ బద్ధంగా పీర్లను పూజలు నిర్వహించి అలంకారం చేసి గ్రామంలో ఊరేగింపు ఉత్సవం నిర్వహిస్తున్నారు. మొహరం పండుగలో భాగంగా బుధవారం ఏడవ సరిగతు సందర్భంగా యువకుల పీర్లను ఎత్తుకుని నృత్యాలు చేస్తూ నిప్పుల్లో నడుస్తూ తమ భక్తిని చాటారు. కంచరగుంటలో ఒక ముస్లిం కుటుంబం కూడా లేనప్పటికీ స్థానిక హిందువులు తమ పూర్వీకులు అనుసరిస్తున్న ఆచారాలతో నిర్వహించడం ఏళ్ళతరబడి ఆనవాయితీగా కొనసాగుతుంది. దేవరకొండ, అరిగెల కుటుంబీకులు తమ ఆచారాలను కొనసాగిస్తూ మత సామరస్యాన్ని నెలకొల్పుతున్నారు. అడిగొప్పల, దుర్గి, ముటుకూరు, కోలగుట్ల, ఓబులేశునిపల్లె, ఆత్మకూరు, ధర్మవరం గ్రామాల్లో హిందూ, ముస్లింల ఐకమత్యంతో పండుగను నిర్వహించటం విశేషం. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గత కొన్ని రోజులుగా పండుగ సందడి నెలకొంది.



వరుణుడి రాకతో సాగుకు సన్నద్ధం



పంటపొలంలో నిలిచిన వర్షపు నీరు

- చినుకు పడింది..కాడి కదిలింది
- ఆశాజనకంగా వర్షాలు
- పొలాలను సిద్ధం చేస్తున్న రైతులు

గురజాల : ఇప్పటికే వేసవి దుక్కుల్లో బిజీగా ఉన్న రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలు ముందస్తు ఖరీఫ్ సాగుకు ఉపయోగపడతాయంటున్నారు. తొలకరి వర్షాలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఖరీఫ్ సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఖరీఫ్ సాగుపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. దాదాపుగా ఇప్పటికే రైతులు పంట పొలాలను వేసవి దుక్కులు పూర్తి చేసి సిద్ధంగా ఉంచారు.

సాగుకు సిద్ధమవుతున్న రైతులు...

తొలకరి వర్షాలు కురవడంతో రైతులు వ్యవసాయ పనులతో పాటు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. పల్నాడు ప్రాంతంలో అధికంగా వరి, పత్తి, మిరప పంటలు అధికంగా సాగు చేస్తారు. ఈ ఏడాది కూడా అత్యధికంగా వరి, మిరప, పత్తి పంట సాగుపై రైతులు మొగ్గుచూపుతున్నారు. అదే విధంగా విత్తనాలతో పాటు ఎరువులు సైతం కొనుగోలు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

పెరుగుతున్న సాగు...

గతంతో పోల్చితే ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరగనున్నదని వ్యవసాయశాఖాధికారులు వెల్లడించారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సంబంధించి పిడుగురాళ్ల క్లస్టర్ పరిధిలోని పిడుగురాళ్ల, మాచవరం, దాచేపల్లి, గురజాల మండలాల్లో సుమారుగా వరి సాగు 15,000 హెక్టార్లు, పత్తి 25,000 హెక్టార్లు, మిరప 10,000 హెక్టార్లు , కంది 4,000 హేహెక్టార్లు సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనాలు తయారు చేశారు. అదే విదంగా గతంతో పోల్చితే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని అధికారులు వెల్లడిస్తున్నారు. .

గిట్టుబాటుతో రైతుల్లో ఆశలు...

రాష్ట్ర ప్రభుత్వం పంట దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ధాన్యపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, ప్రభుత్వం రైతులకు మరింత ప్రోత్సహకాలు అందించడంతో పాటు రైతులకు రైతు భరోసా, ఈ క్రాఫ్ బుకింగ్, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా వంటి పథకాలు అమలు చేయడంతో పంటసాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించడంతో పాటు సేవలు అందించేందుకు గ్రామాల్లో ఆర్బీకేలను అందుబాటులో ఉంచడం జరిగింది. గత పాలకులు వ్యవసాయంపై చిన్నచూపు చూడడంతో పాటు వర్షాలు సరిగ్గా కురవక పోవడంతో బీడు భూములుగా మారాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తు రైతులకు అండగా ఉండడంతో సాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు.

– వేలమూరి సైదారెడ్డి, పీఏసీఎస్ మాజీ చెర్ పర్సన్, గురజాల

అధికారుల సలహాలు తీసుకోవాలి..



తప్పనిసరిగా రైతులు వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలి. రైతులకు అందుబాటులో ఎరువులు, డిఎపి, కాంప్లెక్సు ఎరువులు ప్రతి ఆర్బీకే కేంద్రంలో అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా జిడిసిఎంఎస్‌లో కూడా ఎరువులు అందుబాటులో ఉన్నాయి. రైతులు విధిగా వ్యవసాయాధికారుల సలహాలు , సూచనలు తీసుకుని అధిక దిగుబడి సాధించాలి. ఆర్బీకేల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీ కృష్ణదేవరాయలు, వ్యవసాయ, ఏడీ, పిడుగురాళ్ల

నేరాల నియంత్రణకు చర్యలు

ఈపూరు: నేరాల నియంత్రణకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు నరసరావుపేట డీఎస్పీ కె.వి.మహేష్ అన్నారు. బుధవారం రాత్రి స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మండలంలో ఇటీవల వెలుగులోకి వచ్చిన నకిలీ మిరప విత్తనాల కేసుకు సంబంధించి విచారణ జరుగుతుందన్నారు. మండలంలో రాత్రి పూట గస్తీ పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండల కూడలి మార్గంలో అవసరమైన ఏరియాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మేజరు గ్రామాల్లో వ్యాపార వాణిజ్య సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా నిర్వాహకులకు సూచించారు. అనంతరం పోలీసు సిబ్బందితో మాట్లాడి రికార్డులు పరిశీలించారు. ఆయనతో పాటు వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్, ఎస్సై షేక్ మహమ్మద్ ఫిరోజ్ ఉన్నారు.